ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 305 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి



ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత

## ఇసుక సరఫరా

**తక్కువ ధరకే ఇసుక దక్కేలా చర్యలు**

**ఇసుక రీచ్‌లపై నిఘా పెంచాలి**

**అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గనులు ఖనిజాభివృద్ధిపై సమీక్షించిన ఆయన.. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశర చేశారు. రాష్ట్రంలో ఇసుక రవాణా, తవ్వకాల అంశంపై తెలంగాణ సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద అధికారులు తనిఖీలు చేపట్టాలి. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే బాధ్యతను కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలి. హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట బాధ్యతను హైడ్రాకు ఇవ్వాలి. అన్ని రీచ్‌ల వద్ద కెమెరాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ..మిగతా 2లో

తెలంగాణలో ఏడాదిగా

# కౌరవ పాలన




**అధికారంలోకి వచ్చాక రైతులు సహా అందరికీ మోసం**

**రైతుల భూములు గుంజుకోవడమే రేవంత్‌కు తెలుసు**

**బిఆర్ఎస్ రైతు నిరసన సభలో కెటిఆర్ విమర్శలు**

**నారాయణపేట, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన నడుస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కొడంగల్‌లో భారాస రైతు నిరసన దీక్ష సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేయడం లేదు. అనుముల అన్నదమ్ములు, అదానీల కోసమే పనిచేస్తున్నారు. రూ.కోట్లు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారు. మా ఎమ్మెల్యే సీఎం అయితే మాకు మంచి చేస్తారని కొడంగల్ ప్రజలు ఆశించారు. కానీ, రేవంత్ ప్రజల కోసం పనిచేయడం లేదు. భూములు గుంజుకోవాలనేదే ఆలోచనని అన్నారు.. రైతు బంధు డబ్బులు ఎవరికైనా వచ్చాయా?' అని ప్రశ్నించారు. నారాయణ పేట జిల్లా కోస్గిలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రైతుల సంక్షేమంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ..మిగతా 2లో



రంగరాజన్‌కు సిఎం రేవంత్

## పరామర్శ

**దాడికి పాల్పడ్డ వారిపై**

**చర్యలకు ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** మొయినాబాద్ మండలం చిలుకూరు శ్రీబాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి నేపథ్యంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. రంగరాజన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. ఆ దాడికి సంబంధించిన వివరాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దాడులను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు రంగరాజన్‌ను ఆయన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ అగ్రనేతలు పరామర్శించారు. ఈ దాడి ఘటనను బీఆర్ఎస్ నేతలు ఖండించారు. మరోవైపు.. చిలుకూరు ..మిగతా 2లో

## కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి ముర్ము

**ఘనంగా స్వాగతించిన సిఎం యోగి, గవర్నర్ ఆనందీబెన్**

**త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన ద్రౌపది**



ప్రయాగరాజ్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మహాకుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. త్రివేణీ సంగమ ప్రాంతంలో పడవలో విహరించారు. ఈ సందర్భంగా సంగమం వద్ద వలస పక్షులకు ఆహారం అందించారు. అనంతరం గంగా, యమునా, సర్వసతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మకు ప్రార్థనలు చేశారు. రాష్ట్రపతి ప్రయాగ్‌రాజ్‌లో ఎనిమిది గంటలకు పైగా ఉండనున్నారు. బడే హనుమాన్ ఆలయం, ..మిగతా 2లో

## మతతత్వ ఎజెండాతో బిజెపి పోటీ




**ఎమ్మెల్సీ నామినేషన్లలో పొన్నం విమర్శలు**

**పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు**

**కరీంనగర్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌ని అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మతోన్మాదులు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ కి తగిన గుణపాఠం చెప్పాలని అభ్యర్థిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ ..మిగతా 2లో

హైకోర్టు తీర్పులనే

## గౌరవించరా?


**విద్యాశాఖపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** డీఎస్సీ 2008 ఉద్యోగాల నియామకం విషయంలో విద్యాశాఖపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు ఉత్తర్వులున్నా అమలు చేయకపోవడమేంటని ప్రశ్నించింది. కోర్టు ధిక్కరణగా భావించాల్సి వస్తుందని ప్రభుత్వ న్యాయవాదిని హెచ్చరించింది. ఈ కేసు విచారణకు హాజరై వివరణ ఇచ్చిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్.. నియామక పక్రియ చేపట్టినట్లు తెలిపారు. మూడు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. 1,382 మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని వివరించారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను కోర్టు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లో

# రాబోతున్న సంక్షోభం




**మొత్తం రాజస్థాన్ బీహార్ గుజరాత్ వాళ్ళతో పని**

**పని చేసేవాళ్ళు దొరకని స్థితిలోకి తెలుగు రాష్ట్రాలు**

**ఇతర రాష్ట్రాల పని వాళ్ళ చేతిలో కీలక రంగాలు**

**ఉచితాలకు అలవాటు పడుతున్న తెలుగు ప్రజలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బయట రాష్ట్రము నుండి మార్వాడి రావడం తోలిరాబోయే కాలంలో పని సంక్షోభం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలు కీలక రంగాల్లో ఇతర రాష్ట్రాల ప్రజలు పాతుకుపోయారని, ఇది ఇలాగే కొనసాగితే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని నిపుణుల అభిప్రాయం. ..మిగతా 2లో



పరీక్షలే సర్వస్వం కాదు..

## మనం రోబోలం కూడా కాదు

**పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందుకు సాగాలి**

**బంతిపై బ్యాటర్ దృష్టిలా చదువుపై శ్రద్ధ పెట్టాలి**

**తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెంచరాదు**

**పరీక్షాపై చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్స్‌గా ప్రదర్శించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. పరీక్షలే సర్వస్వం కాదన్నారు. మనం రోబోలం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని సూచించారు.'బయటినుంచి వచ్చే ఒత్తిడి వీరీద కాకుండా చదువువీరీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు చేస్తున్నా.. బ్యాటర్ దృష్టి ..మిగతా 2లో




# రంగరాజన్‌కు సిఎం రేవంత్ పరామర్శ

మొదటి పేజీ తరువాయి...

శ్రీబాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి సంబంధించిన అంశాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో వివరించారు. ప్రధాన నిందితుడు కొవ్వూరి వీర రాఘవరెడ్డిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, తన సంస్థలో హిందువులను చేర్పించాలంటూ రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ దాడి చేసిందని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి, ఇద్దరు మహిళలు సహా మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 'ఈ ఉదయం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. నిందితులు ఖమ్మం, నిజామాబాద్‌కు చెందినవారు. ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని కూడా అదుపులోకి తీసుకున్నాం. తమకు ఆర్థికంగా సాయం చేయాలని, రామరాజ్యంలో సభ్యుల్ని చేర్పించాలని రంగరాజన్‌ను డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించడంతో ఆయనపై దాడి చేశారని డీసీపీ వివరించారు. '2022లో వీరరాఘవరెడ్డి 'రామరాజ్యం'ను స్థాపించాడు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ప్రచారం చేశాడు. రామరాజ్యంలో చేరితే రూ.20వేలు జీతం ఇస్తానని చెప్పాడు. తణుకు, కోటప్పకొండలో వీరరాఘవరెడ్డి పర్యటించాడు.రామరాజ్యంలో చేరిన వారిని యూనిఫామ్ కుట్టించుకోమన్నాడు. ఈ నెల 6న అందరూ యాప్రాల్‌లో కలిశారు. రామరాజ్యం బ్యానర్‌తో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. వాటితో సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ నెల 7న మూడు వాహనాల్లో వీరరాఘవరెడ్డి అనుచరులు 25మంది నల్ల దుస్తుల్లో చిలుకూరు వచ్చి రంగరాజన్‌పై దాడి చేశాడు. ప్రస్తుతం మణికొండలో ఉంటున్న వీరరాఘవరెడ్డి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం' అని డీసీపీ తెలిపారు.

# తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన

మొదటి పేజీ తరువాయి...



మాట్లాడుతూ రాష్ట్రంలో 25 శాతం రైతులకు రుణమాఫీ ఇంకా జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. మా హయాంలో 73 వేల కోట్ల రూపాయలను 12 సార్లు రైతుల ఖాతాలకు రైతుబంధు పథకానికి అందించామన్నారు. ఇది రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం చేసిన కృషి అని తెలిపారు. కానీ ప్రస్తుతం రైతులకు ఈ ప్రభుత్వం ఒక్కొక్కరికి 17,500 రూపాయలు బాకీ ఉందని, ఈ మొత్తాన్ని త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆయన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి కంది రైతుల ధాన్యం కొనుగోలు చేయలేకపోవడం, బాధాకరమని ఆయన అన్నారు. ఏ ఒక్క గ్రామంలోనైనా పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగితే, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి రాజకీయాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడ రైతులకు, పార్టీ కార్యకర్తలకు నష్టం కలిగినా మేము రక్షణగా ఉంటామని కేటీఆర్ అన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కేవలం కమిషన్ల కోసమే అని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కోస్గి మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కూడా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గ ప్రజలు ఉప ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన తెలిపారు. కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రేవంత్ రెడ్డిని ఉప

ఎన్నికకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి 50,000 ఓట్ల మెజారిటీ తక్కువగా వచ్చినా, తాను రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ చెప్పారు. కొడంగల్ ప్రజలు రేవంత్ రెడ్డిని ఎప్పుడు బొంద పెడదామా అని ఎదురుచూస్తున్నారని, ఆయనపై ప్రజల ఆగ్రహం అంతగా పెరిగిందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ, 'రేషం లేని వ్యక్తి కాబట్టి, ఆయన తుడిచేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని 'దుర్యోధనుడు'గా అభివర్ణిస్తూ, కొడంగల్‌లో కురుక్షేత్ర యుద్ధం జరుగుతున్నట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి 14 నెలల పాలనలో ఎనుముల అన్నదమ్ములు, అల్లుడు, అదానీ కోసం మాత్రమే పని చేస్తున్నారని ఆరోపించారు. లగచర్ల పచ్చని పంట భూములపై పలువురు చేసిన వ్యాఖ్యలపై 40 మంది రైతులను జైలుకు పంపడం వంటి అంశాలను ప్రస్తావించారు. కొడంగల్ రేవంత్ అయ్య, తాత జాగీరు కాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# మతతత్వ ఎజెండాతో బిజెపి పోటీ

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నాని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరంర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించాలని, గ్రాడ్యుయేట్లకు కాంగ్రెస్ ఎంతో మేలు చేసిందన్నారు. నాలుగు జిల్లాలో పెండిరగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, నాటి ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి గడగడలాడిరచారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, జిల్లా ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ ఎన్నిక కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకమన్నారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని కోణాల్లో నుంచి పరిశీలించి సత్తా ఉన్న నరేందర్ రెడ్డి ని అభ్యర్థిగా ఎంపిక చేయడం జరిగిందని, కాంగ్రెస్ అంటే కమిట్మెంట్ పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ఇస్తామని చెప్పాము ఇచ్చామని, బీజేపీ తో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. డిపాజిట్ రాదనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, కేసీఆర్ ఏడాదికి 5వేల ఉద్యోగాలు ఇస్తే సీఎం రేవంత్ నెలకు 5వేల ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. ఖాళీలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, కేంద్రమంత్రిగా ఉండి బండి సంజయ్ రూపాయి కూడ తీసుకు రాలేదన్నారు. బ్జడెట్ లో తెలంగాణ రూపాయి పెట్టించలేని బీజేపీ నలుగురు ఎంపీ లు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ మాట నిలుపుకుంది కాబట్టి నరేందర్ రెడ్డి కి ఓటు వేయాలన్నారు. ఏడాది కాలం లో రేవంత్ రెడ్డి ,శ్రీధర్ బాబు రెండు లక్షల 30 కోట్లు పెట్టుబడులు తీసుకు వచ్చారని, ఏ ప్రభుత్వం కూడ చేయని కుల సర్వే చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. బీసీ కుల గణన చారిత్రాత్మకం . కాంగ్రెస్ చేసిన కుల గణన వల్లే 56శాతం బీసీలున్నట్లు తేలిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పరీక్షలే సర్వస్వం కాదు.. మనం రోబోలం కూడా కాదు

మొదటి పేజీ తరువాయి...



మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి' అని అన్నారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇతర పిల్లల్లాగే ఉండేలా చూడాలని, వీరీ పిల్లలు వారికి అత్యంత ఆసక్తి ఉన్న అంశాల గురించి చదివేలా చేయాలని మోదీ సూచించారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పిల్లలతో ముచ్చటించారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ వీడియోను సోమవారం ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. దిల్లీలోని సుందరవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎప్పుడూ ఒక పెద్ద హాల్‌లో పరీక్షలకు సంబంధించిన అనుమానాలు, ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలపై సోదాహరణంగా వివరించే మోదీ.. ఈసారి విభిన్నంగా విద్యార్థులతో ముచ్చటించారు. సుందరవనంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని బదులిచ్చారు.పిల్లలు తమ ఆసక్తులను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, అందరితో బహిరంగంగా మాట్లాడాలని, తల్లిదండ్రులు తమ సమస్యలను పిల్లలపై రుద్దకూడదని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ప్రతి పిల్లలు ఏదో ఒక రంగంలో రాణిస్తారని అన్నారు.ఈ కార్యక్రమం కోసం 3.15 కోట్ల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 19.80 లక్షల మంది టీచర్లు, 5.20 లక్షల మంది తల్లిదండ్రులు ఉన్నారు. నేరుగా మాత్రం 36 మంది, మిగతావారంతా వర్చువల్‌గా పాల్గొన్నారు. 'ప్రతి విద్యార్థికి భిన్నమైన టాలెంట్ ఉంటుంది. కొంతమంది చదువులో ముందుంటారు. మరికొందరికి మంచి డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. విద్య సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించినది. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వారు తమ అభిరుచుల వైపు మళ్లేందుకు స్వేచ్ఛ అవసరం. పరీక్షలే సర్వస్వం అనే భావనలో జీవించకూడదు. పిల్లలకు సలహాలు ఇవ్వకూడదు. వారిలో ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయో గమనించాలి. వారిలో ఉన్న విశిష్టమైన ప్రతిభను వెలికితీయాలి' అని చిన్నారులు, టీచర్లకు మోదీ సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను ప్రధాని ఉదహరించారు. 'సచిన్‌కు చదువు కంటే ఆటల వీరీదే ఆసక్తి ఎక్కువ ఉండేది. దాన్ని గుర్తించిన అతడి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు' అని ప్రధాని గుర్తుచేశారు. 'సమయపాలన అన్నింటికంటే ముఖ్యం. రేపు వీరీరు ఏం చేయాలని అనుకుంటున్నారో ఒక కాగితం వీరీద రాసుకోవాలి. ఏ పని కోసం ఎంత సమయం వెచ్చించాలో ఆలోచించుకోండి. వీరీకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం, ఇష్టం లేని దానికి తక్కువ సమయం కేటాయించొద్దు. దానికి భిన్నంగా చేయండి. కష్టమైన పాఠ్యాంశాన్ని ఒక సవాలుగా స్వీకరించండి' అని సలహా ఇచ్చారు. 'స్నేహితుల్లో మంచి లక్షణాలు గమనించండి. దానివల్ల ప్రతి పనిలో సానుకూలతను చూసే అలవాటు పెరుగుతుంది. ఇక స్నేహితుల కష్టాలను అర్థం చేసుకునేందుకు వారితో మాట్లాడండని అన్నారు. కేరళ నుంచి వచ్చిన విద్యార్థి ఆకాంన్షా ప్రధాని మోదీని హిందీలో పలకరించారు. దాంతో ఆశ్చర్యపోయిన ఆయన.. ఇంత చక్కగా హిందీ ఎలా నేర్చుకున్నావంటూ ప్రశ్నించారు. 'నాకు హిందీ అంటే చాలా ఇష్టం. నేనొక కవిత కూడా రాశా' అంటూ దానిని చదివి వినిపించారు. అలాగే.. వీరీరు ప్రధాని కాకపోయి ఉంటే ఏ మంత్రిత్వ శాఖ తీసుకుంటారని ఓ విద్యార్థి మోదీని అడిగారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'నైపుణ్యాభివృద్ధి శాఖ అంటే ఆసక్తి' అని చెప్పారు. 'నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవి కాబట్టి నేను నైపుణ్యాల విభాగాన్ని ఎంచుకుంటాను అని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నైపుణ్యాలపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలు అలసిపోతే పరీక్షల్లో బాగా రాయగలరా? అని అన్నారు. మనం రోబోలము కాదు, మనుషులం. పిల్లలను నాలుగు గోడల మధ్య బంధించి పుస్తకాల చెరసాలలో వేస్తే, వారు ఎప్పటికీ ఎదగలేరు అని ప్రధానమంత్రి అన్నారు. వారికి బహిరంగ ఆకాశం కల్పించాలని, స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరీక్షల ఒత్తిడి నుండి విద్యార్థులను విముక్తి చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కార్యక్రమం లక్ష్యం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి ఒత్తిడి స్థాయిలను తగ్గించడం, వారు ఆరోగ్యంగా ఉండటానికి ప్రేరేపించడమే ప్రధాన ఉద్దేశం.

## కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి ముర్ము

మొదటి పేజీ తరువాయి...

పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. అదేవిధంగా కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు ప్రయాగ్‌రాజ్ నుంచి న్యూఢల్లీకి బయల్దేరుతారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జనవరి 13న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాకుంభ్ మేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటివరకూ 42 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్రస్నానాలు ఆచరించారు. కాగా, ఈ నెల 5న ప్రధాని మోదీ కూడా కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించారు. గంగానదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 90 నిమిషాల పాటు ఆయన మహాకుంభమేళాలో గడిపారు.

## వైభవంగా శ్రీ భవాని శంకర అమ్మవారి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం




కొత్తకోట, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో కొలువై న శక్తి స్వరూపిణిగా కొలిచే వారికే కొంగు బంగారంగా వెలిసిన శ్రీ భవాని శంకర అమ్మవారి వేడుకల్లో చివరిఘట్టమైన అమ్మ, స్వామివారి ల ధ్వజస్తంభన ప్రతిష్టాపన మహోత్సవం నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం భవాని మాత ధ్వజస్తంభం శివుని ధ్వజ స్తంభం మహోత్సవం పట్టణం లో ఉదయం ప్రారంభమైన అమ్మవారి ధ్వజస్తంభం, అత్యంత వైభవంగా చేరి 10వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభ ఏర్పాటు కొరకు మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు ఉత్సాహాలు నిర్వహించారు. ఈ శుభ యాత్రలో దాదాపు 10,000 వేల మంది వరకు భక్తులు పాల్గొన్నారు. భక్తులు ప్రజలు మహిళలు జై భవాని జై జై భవాని నామస్మరణతో అమ్మవారి దేవాలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు ప్రజలు సోమవారం తెల్లవారుజాము నుండి దేవాలయానికి చేరుకొని దర్శనాలు చేసుకున్నారు . మహిళలతో అత్యంత కొలహాలంగా కిక్కిరించి సంప్రదాయ అర్చకుల మంత్రాల, వాయిద్యాల నడుమ అమ్మవారి స్వామివారి ధ్వజస్తంభాలు ప్రతిష్టాపన జరిగాయి. భక్తులకు ప్రజలకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలతో పాటు వేలాది మంది భక్తజనానికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ అంబా భవాని శంకర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం



ప్రతిష్టాపన మహోత్సవంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ పారిజాతం దంపతులు



పూజల్లో పాల్గొన్న మాజీ రాజ్యసభ రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు

కొత్తకోట, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ అంబా భవాని శంకర్ దేవాలయం లో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం , కానాయిపల్లి వెంకటగిరి క్షేత్రమందు వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి , ఆయన సతీమణి డాక్టర్ పారిజాతమ్మ , మాజీ శాసనసభ్యులు, రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి , ఆయన సతీమణి రావుల వరలక్ష్మి, మాజీ సర్పంచ్ మూలమల్ల భీమ్ రెడ్డి , ప్రవీణ్ అయ్య ,మాజీ మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, మూలమల్ల యుగేందర్ రెడ్డి, పాలెం మోహన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి నరోతం రెడ్డి పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా

మొదటి పేజీ తరువాయి...

ఫెన్సింగ్ వేయాలి. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోపు వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున సాయం చేస్తున్న విషయం తెలిసిందే.

# తెలుగు రాష్ట్రాల్లో రాబోతున్న సంక్షోభం

మొదటి పేజీ తరువాయి...

**ఇతర రాష్ట్రాల పని వారు, వారు చేసే పనులు:**

బీహార్ వాళ్లు:-ఇటుక బట్టి నుండి, వరినాట్లు, పత్తి ఏరే దాకా అన్ని రకాల కూలి పనులు చేస్తున్నారు.

ఒరిస్సా వాళ్లు:-అన్ని రకాల కార్మికులుగా వంటకాల తయారీదారులుగా చేస్తున్నారు.

రాజస్థాన్ వాళ్లు:-టీ స్టాల్ మరియు హెూటల్, సానిటరీ షాప్‌ల నిర్వహణ చేస్తున్నారు రెండు తెలుగు రాష్ట్రము వీళ్ల షాప్‌లే ఎక్కువ

ఉత్తరప్రదేశ్ వాళ్లు:-టైల్స్ వేసే పని నుండి పెయింటింగ్, అన్ని రకాల ఇంటి లోపలి అలంకరణలు చేస్తున్నారు.

కేరళ వాళ్లు:-ఇంగ్లీష్ బోధించు టీచర్లుగా పని చేస్తున్నారు.

కర్ణాటక వాళ్లు:-భవన నిర్మాణ కూలీలుగా పని చేస్తున్నారు.ఇలా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చి ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.రెండు తెలుగు రాష్ట్రాల వాళ్లు మాత్రం మందు, మాంసం ఎవడు పంచుతాడు ఎవడు ఎక్కువ డబ్బులు ఇస్తాడు అంటూ పూటకో జెండా చేతిలో పట్టుకుని తెలిసిన పనిని, చేతిలో ఉన్న వృత్తినీ వదిలేసి సమయాన్ని వృధా చేస్తూ ఉచితాలకు, వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ సంపదను గణనీయ భాగం ఇతర రాష్ట్ర ప్రజలు తీసుకు పోతే మన వాళ్ళు దివాలా స్థితికి వస్తారు. వారు పని చేసే అలవాటు Work Culture కూడా మర్చి పోతారు. ఆ తరువాత పని చేస్తామన్నా ఎవరూ పని ఇవ్వని పరిస్థితి వస్తుంది. ఇది రాబోయే కాలంలో ఏపీ, తెలంగాణలో పని చేసే వారిని సంక్షోభ స్థితికి నెట్టి వేస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి చేసిన ఐదుగురు అరెస్ట్



వీర రాఘవ రెడ్డి



పోలీసుల అదుపులో నిందితులు



రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

బుద్వేల్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) : చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడి చేసిన వీర రాఘవరెడ్డి తో పాటు మరో ఐదుగురుని మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్ కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఈస్ట్ గోదావరి కి చెందిన వీర రాఘవ రెడ్డి 2022 లో రామ రాజ్యం ఆర్మీ ని స్థాపించాడు.. ప్రవచనాలు, భగవద్గీత శ్లోకాలతో సోషల్ మీడియా లో ప్రచారం చేసుకున్నాడు సెక్యూరిటీ ఉద్యోగాల పేరుతో కొంతమందిని నియమించుకున్నాడు.. నెలకు రూ. 20 వేల జీతం, వసతి ఇస్తాను అని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో కొంతమంది ఈ ఆర్మీ లో చేరారు.. ఒక్కొక్కరి దగ్గర 2 వేలు వసూలు చేసి.. వాళ్లకు ఒక డ్రెస్ కోడ్ ఇచ్చాడు రాముడి అంశలో పుట్టాను.. శివుడే నన్ను పంపాడు అని చెప్పుకుంటాడు.. తన టీమ్స్‌తో కలిసి వెళ్ళి.. కొన్ని ఆలయాల్లో దౌర్జన్యం చేశాడు.. ఏపీ, తెలంగాణలో కొన్ని ఆలయాలు తిరిగాడు. డబ్బులు డిమాండ్ చేశాడు ఈ నెల 6వ తేదిన చిలుకూరు బాలాజీ దేవాలయంకు వెళ్ళారు.. ఆలయంలో తన ఆర్మీ కి చెందిన టీమ్‌ను పెడతాం జీతాలు మీరే ఇవ్వాలి అని డిమాండ్ చేశాడు. తన ఆర్మీ కి కొంత డబ్బు ఇవ్వాలి అని డిమాండ్ చేశాడు. ఇందుకు ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ ఒప్పుకోలేదు. దీంతో రంగరాజన్ పై దాడి చేసారు. ఈ దాడిలో మొత్తం 25 మంది పాల్గొన్నారు. వారిలో 23 మందిని గుర్తించామన్నారు. ఇందులో 12 మంది ఏపీ, 11 మంది తెలంగాణ వాళ్ళు ఉన్నారన్నారు. వీరరాఘవరెడ్డిపై అబిడ్స్‌లో 2015లో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసు నమోదు అయ్యింది. జూబ్లీహిల్స్‌లో కూడా ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన కేసు కూడా నమోదు అయ్యింది. మిగతా వారిని కూడా గుర్తించి పట్టుకుంటాం. అని తెలిపారు.

**ముఖ్యమంత్రి ఆదేశాలతో...**

చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడం, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ రంగరాజన్‌ను కలిసి పరామర్శించారు. స్పందించిన పోలీసులు సోమవారం రాత్రి వీర రాఘవరెడ్డి తో పాటు మరో ఐదుగురిని ఆరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని రాత్రి తొమ్మిదిన్నర గంటలకు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు.

## ఈ నెల 12, 13 తేదీలలో రాజేంద్రనగర్‌లో సమ్మక్క సారలమ్మ ఎదురుపున్నమి వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి10(బుద్వేల్): రాజేంద్రనగర్ మానసహిల్స్ పక్కన ఏవీఎస్ రెడ్డి కాలనీ సమీపంలో గల సమ్మక్క, సారమ్మ ల దేవాలయంలో ఈ నెల 12, 13 తేదీలలో ఎదురు పున్నమి జాతర వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నీరుడు శ్రీరాములు ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం . సమ్మక్క సారలమ్మ జాతరల అనంతరం రాజేంద్రనగర్ లో అమ్మవార్లకు ఎదురుపున్నమి జాతర చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారికి కుంకుమ భరిణీలు సమర్పించడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోతురాజుల ఊరేగింపు. శివసత్తుల పూనకాలతో రెండు రోజులు అంగరంగ వైభవంగా పూజలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



రాజేంద్రనగర్ మానస హిల్స్ సమీపంలోని సమ్మక్క సారలమ్మ దేవాలయాలు

## పేదలు, అనాధల మధ్య జన్మదిన వేడుకలను నిర్వహించుకున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అబ్బేశి సదాలక్ష్మీ



సదాలక్ష్మిని సన్మానిస్తున్న స్థానికులు



కేక్ కట్ చేస్తున్న సదాలక్ష్మి

బుద్వేల్, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం): మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఉడంగడ్డ వాస్తవ్యురాలు ఎ.సదాలక్ష్మీ సోమవారం తన పుట్టిన రోజు వేడుకలను శివరాంపల్లిలోని నైట్ షెల్టర్ లో నిర్వహించారు. నైట్ షెల్టర్ లో ఉంటున్న వృద్ధులు, వలస కార్మికుల మధ్య ఆమె కేక్ కట్ చేసి వారికి తినిపించారు. నైట్ షెల్టర్ లో ఉన్నవారితో పాటు చుట్టుపక్కల వారికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేదలు, నా అనే వారు లేని వారి మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ద్వారా ఎంతో ఆనందం ఉంటుందన్నారు.

## నూతన మండలాలు ఏర్పాటు చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం) పరిపాలన సౌలభ్యం కొరకు గద్వాల నియోజకవర్గంలో మరో ఐదు కొత్త మండలాలను ఏర్పాటు చేసి, ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలని అఖిల పక్షం కమిటి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గద్వాలలోని వాల్మీకి భవనములో అఖిలపక్షం ఆధ్వర్యంలో నూతన మండలాల ఏర్పాటు కొరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వక్తలు, అఖిలక్షం నాయకులు, ప్రజలు నూతన మండలాల ఏర్పాటు కొరకు కార్యచరణను ప్రకటించారు. పలు ప్రతి పాదనలు ఏకగ్రీవ తీర్మాణాలు చేశారు. అఖలక్షం ఆధ్వర్యంలో ప్రజలు ప్రతిపాదించిన మండలాలు వారిగా మల్దకల్ మండలం నుండి ఎల్కూరు, బిజ్వారం, గట్టు మండల నుండి బలిగేర, మాచర్ల మిట్టదొడ్డి, చాగదొన, ఐజ మండలం నుండి మేడికొండ, టిటి దొడ్డి, ధరూర్ మండలం నుండి ఉప్పేరు, రేవులపల్లి, గద్వాల మండలం నుండి పూడూరు, అనంతపురం, కేటి దొడ్డి మండలం నుండి నందిన్నె గిరిజన మండలంగా, గట్టు మండలంలో ఆలూరు గిరిజన మండలాలుగా ఏర్పాటుకై ప్రతిపాదించారు. రెండవ తీర్మానం గద్వాల నియోజకవర్గంలోని ధరూర్, మల్దకల్, బలిగెర, మాచర్లను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. గద్వాల అలంపూర్ నియోజకవర్గాల్లో ఎంపీటీసీ స్థానాలను పెంచాలని తీర్మాణం చేశారు. గద్వాల జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో కౌన్సిలర్ స్థానాలను పెంచాలని తీర్మాణం చేశారు. గద్వాల నియోజకవర్గంలో నూతన పంచాయతీలు ఏర్పాటు చేయాలని తీర్మాణం చేశారు. కార్యచరణలో భాగంగా ఈనెల 17వ తేదీన అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించి, తీర్మాణాలను ప్రభుత్వం దృష్టిలి తీసుకెళ్లి ఏర్పాటు చేయాల్సిందిగా కోరడం జరుగుతుందన్నారు.




ప్రైవేటు ట్రావెల్స్ బస్సు లను తనిఖీ చేస్తున్న కొండాపూర్ రవాణ శాఖ అధికారులు





తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

## టాక్స్ కట్టకుండ తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సీజ్

బుద్వేల్, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సదానందం పర్యవేక్షణలో సోమవారం కొండాపూర్ ఆర్టీఏ అధికారులు ఆరాంఘర్ చౌరస్తాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర టాక్స్ కట్టకుండ తిరుగుతున్న నాలుగు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేశారు. వైఏఎస్, ఎస్ఆర్, ఎస్ఆర్ఎస్, విజయానంద్ ట్రావెల్స్ లకు చెందిన ప్రైవేటు బస్సులను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. సీజ్ చేసిన బస్సులను సీజింగ్ యార్డుకు తరలించినట్లు అధికారులు తెలిపారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలని, ఎన్ఆర్ఐ టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్1,2, సిఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, కీర్తి విల్లా పరిధిలలో విద్యుత్తు పనుల నిర్వహణ నిమిత్తం సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## ఈ నెల 12న ఉప్పర్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం

బుద్వేల్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం): గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉప్పర్ పల్లి లో గల సంస్థ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ కు చెందిన కె లూక్ జాన్సన్ ఓ ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అవసరమైన వారికి కళ్ళ అద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు. మందులను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9347572957, 80089 00662 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

## కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

**కాశీలో పెరిగిన వాహనాల రద్దీ**

**పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు**

**వారణాసి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):** మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు పోటెత్తుతున్నారు. రోజులు గడుస్తున్నా రద్దీ మాత్రం తగ్గడం లేదు. రోజుకు సగటున 1.44 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు ముగించుకున్న భక్తులు.. కాశీ, అయోధ్య లకు వెళ్తున్నట్లు తెలిపారు. భక్తుల తాకిడి విపరీతంగా పెరుగుతుండడంతో కాశీలోని పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. మరోవైపు, రైళ్లలో సీట్లు దొరకకపోవడంతో ప్రయాణికులు లోకో పైలట్ ఉండే ప్రాంతాల్లో కూర్చునే ప్రయత్నం చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రయాగ్‌రాజ్‌లో రైల్వేస్టేషన్ వెలుపల భక్తుల రద్దీ కారణంగా.. ఉత్తర రైల్వే ప్రాంతంలోని లఖ్‌నవూ డివిజన్ ఫిబ్రవరి 9 మధ్యాహ్నం నుంచి 14 అర్ధరాత్రి వరకు ప్రయాణికుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మహాకుంభ్‌లోని ఎనిమిది రైల్వే స్టేషన్లు ప్రత్యేక రైల్వే సేవలను అందిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ఈ కార్యక్రమం ప్రారంభమై 28రోజులు గడుస్తున్నా.. రద్దీ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రయాగ్ రాజ్ వైపు వెళ్లే మార్గాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. దాదాపు 200–300 కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లే. గంటల కొద్ది యాత్రికులు వాహనాల్లోనే ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దర్శనిమిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్–కాన్పుర్,ప్రయాగ్‌రాజ్–లఖ్‌నవూ–ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్–వారణాసి–మిర్జాపుర్,ప్రయాగ్‌రాజ్–రేవా వెళ్లే జాతీయ రహదారుల్లో మూడు రోజులుగా విపరీతమైన రద్దీ కొనసాగుతోంది. పుణ్యస్నానాలు ముగిం చుకున్న భక్తులు కాశీ, అయోధ్యకు వెళుతుండడంతో ఆయా మార్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తుండడంతో రాకపోకలపై ఆంక్షలు విధించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితా రెడ్డి

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితా రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కనాయపల్లి సమీపంలోని వెంకటగిరి గుట్ట వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సతీమణి కవితా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తకోట పట్టణంలో ఆనంద్ కన్వెన్షన్ హాల్ లో భీమా భాస్కర్ మనవరాలి డోలరోహణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.



హెూటళ్లలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ విభాగం టాస్క్ ఫోర్స్ అదికారులు



హెూటల్ నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్న అదికారులు

## హెూటళ్లకు వెళుతున్నారా.. జర జాగ్రత్త

బుద్వేల్, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లోని కొన్ని హెూటళ్లు అపరిశుభ్రమైన వాతావరణంలో కొనసాగుతున్నాయి. స్విగ్గీ, జోమాటో లో ఆర్డర్ పెట్టుకోగా అపరిశుభ్రంగా అహార వస్తువులు వచ్చాయని ఓ వ్యక్తి ఆన్ లైన్ లో గ్రేటర్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు గత వారంలో ఫిర్యాదు చేశారు. దానిపై స్పందించిన గ్రేటర్ ఫుడ్ సేఫ్టీ టాస్ఫోర్స్ 'బృందంలోని ముగ్గురు అధికారులు శనివారం అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 121 హనుమాన్ దేవాలయం నుంచి బాపూఘాట్ వైపు వెళ్లే రహదారిలో ఉన్న ది ఫోర్త్, డెలిష్ మై హెూమ్స్ కిచెన్ రెస్టారెంట్లలో తనిఖీ లు చేశారు. ఈ రెండు హెూటళ్లు అపరిశుభ్రమైన వాతావరణం లో ఉన్నాయని. పెద్ద మొత్తంలో కూరగాయలు ఎక్కువ రోజుల నుంచి నిల్వ ఉంచారని తెలి పారు. నిల్వ ఉంచిన ఫ్రిజ్ కూడా సరిగ్గా లేదన్నారు. బొద్దింకలు తిరుగుతున్నట్లు కనిపించిందని అదికారులు తెలిపారు. దీనిపై సదరు హెూటళ్ల నిర్వాహకులకు నోటీసులు ఇవ్వడం జరిగిం దన్నారు. ఏడు రోజుల లోగా వారు సమాధానం చెప్పవలసి ఉంటుందని, ఆ తర్వాత వారిపై చర్యలు తీసుకోవడం జరుగుందని ఫుడ్ సేఫ్టీ బాస్క్ ఫోర్స్ టీమ్ సభ్యులు తెలిపారు.



బీసీజీ టీకా పెద్దలకు కూడా వేయాలని అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## బీసీజీ టీకా ఇక మీదట పెద్దలకు కూడా

బుద్వేల్, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం): చిన్న పిల్లలు ఇచ్చే బీసీజీ టీకా ను ఇక మీదట పెద్దకు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా సోమవారం శివరాంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సం 'దర్భంగా టీబీ నివారణ విభాగం సూపర్వైజర్లు రహీమ్, నరేశ్ లు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి ఆర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి బీసీజీ టీకా పై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి వ్యాప్తిని నిరోదించడానికి చిన్న పిల్లలకు ఇచ్చే బీసీజీ టీకా ను ఇక మీదట పెద్దలకు కూడా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలుపుతున్నామన్నారు. 60 సంవత్సరాలకు పైబడినవారు. డయాబెటిస్ తో బాధపడుతున్నవారు. పొగత్రాగే అలవాటు ఉన్నవారు. ఇప్పటికే ఏ కుటుంబంలోనైన టీబీ తో బాధపడుతున్న వారు ఉంటే అలాంటి వారిని గుర్తించి వారు రిస్క్ లో ఉన్నారని వారికి బీసీజీ టీకాలను వేయడం జరుగతుందన్నారు. టీబీ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. అందుకు బీసీజీ టీకా రక్షణ కల్పిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ మేనేజర్ గౌరీ, సిబ్బంది భాగ్యలక్ష్మి, శిల్ప. జ్యోతి, లక్ష్మి, అషా వర్కర్లు చెన్నమ్మ, సారది, అంబికలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్

## అత్తాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బుద్వేల్, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం): అత్తాపూర్ పోచమ్మ దేవాలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు రూ.19.8 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్ మాట్లాడుతూ, పనులు మంజూరైనప్పటికి కొందరు కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో చాలా బస్తీలలో పనులు ప్రారంభించడానికి ఆలస్యం అవుతుందన్నారు. అయినప్పటికి అధికారులతో మాట్లాడి దశలవారిగా అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేసేటట్లు అధికారులు పర్యవేక్షించాలని, అదే సమయంలో ప్రజలు కూడా పనులు జరుగుతున్న సమయంలో దగ్గరుండి అవి నాణ్యతగా జరుగుతున్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రం గారెడ్డి జిల్లా కార్యదర్శి మొంద్ర కొమురయ్య, స్టార్ చిన్న, సరితారెడ్డి, డి.సునీత, జీహెచ్ఎంసీ "ఏఈ రాజేశ్, వర్క్ ఇన్స్పెకర్ ఎ.రాజుతో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



# జిహెచ్ఎంసి అనుమతులు రెండు... అదనపు అంతస్తులు మరో మూడు

## హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

## కార్పొరేటర్ కు ఒక న్యాయం... సామాన్య ప్రజలకు ఒక న్యాయమా..?

## జోనల్ కమిషనర్ తో యుగంధర్ రెడ్డి తీవ్ర వాగ్వివాదం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, బాలానగర్ కార్పొరేటర్ అవుల రవీందర్ రెడ్డి ఒక 420 అని, గ్రౌండ్ ప్లస్ 2 అనుమతులు తీసుకుని అక్రమంగా అదనంగా మరో మూడు అంతస్తులు అక్రమంగా నిర్మించి కోర్టుకు అబద్ధం చెప్పాడని, తక్షణమే చర్యలు చేపట్టి కూల్చివేతలు చేపట్టాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సోమవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను లిఖిత పూర్వకంగా కోరారు. కేవలం రెండు అంతస్తులు కట్టుకుంటే కూకట్ పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వేధిస్తున్నారని కింది కోర్టుకు అబద్ధాలు చెప్పిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్ తో కాంగ్రెస్ నేతలతో జోనల్ కమిషనర్ ను కలిశారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నా కూకట్ పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, రాజ్యాంగం అందరికీ ఒక్కటేనని, కార్పొరేటర్ కు వేరే రాజ్యాంగం ఏదైనా ఉందా అని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. ఒక దశలో యుగంధర్ రెడ్డి, ఆకుల నరేందర్ ముదిరాజ్, మధు గౌడ్ లకు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తన గొంతును గట్టిగా చేసి అరిచారు. కాంగ్రెస్ నేతలకు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ మధ్య తారాస్థాయిలో వాదోపవాదాలు జరగడంతో అధికారులు మధ్యలో కలుగజేసుకుని సర్ది చెప్పారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 420 అని సంబోధించి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, కార్పొరేటర్ అవుల రవీందర్ రెడ్డిని ఉపేక్షించే పరిస్థితి లేదని, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి కూకట్ పల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు సహకరిస్తున్నారని తీవ్రంగా ఆగ్రహించారు. అధికారుల చేతగాని తనంతోనే హై కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా జోనల్ కమిషనర్ కూల్చివేతలు చేపట్టకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను ప్రశ్నించారు. యుగంధర్ రెడ్డి, మధు గౌడ్ లను శాంతించండి, కూర్చోండి అంటూ తన పక్కనే కూర్చో బెట్టుకుని సామరస్యంగా సమస్యను విన్నాడు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా అదనంగా మరో మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ చెప్పినట్లు యుగంధర్ రెడ్డి అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు.



# ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన

## ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ లో శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, గూడెపు నాగరాజు, సాదు ప్రతాప్ రెడ్డి, సునీల్ యాదవ్, శివ చౌదరి గొట్టిముక్కల భాస్కర్ రావు పాల్గొన్నారు.



# మట్టి అక్రమ తరలింపు

## కేటిదొడ్డి మండలంలో ప్రభుత్వ ఆదాయానికి గండి

## అధికారుల తీరుపై స్థానికుల అనుమానం?

కేటిదొడ్డి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలంలో అక్రమార్కులు పట్టపగలే జోరుగా మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. పోలీస్, రెవెన్యూ శాఖలో పలువురు వీరికి సహకరిస్తున్నారన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా సమాచారమిస్తే ఇప్పుడే సిబ్బందిని పంపుతున్నామని అంటున్నారే గానీ ఎవరినీ పంపడ లేదని సమాచారం. సోమవారం కేటిదొడ్డి మండల కేంద్రంలో ట్రాక్టర్ ల ద్వారా మట్టిని పెద్ద ఎత్తున తరలించినా చూసీచూడనట్లు వ్యవహరించారని విమర్శలున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎక్కడ తవ్వకాలు జరిపినా అనుమతులు పొందాలి. కాని ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా మట్టిని తరలించి ఈ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోందని స్థానికులు అంటున్నారు. పట్టపగలే మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు కేటి దొడ్డి పోలీస్ లకు సమాచారం అందిస్తే సిబ్బందిని పంపించగా అక్రమార్కులు మట్టి తరలింపును నిలిపివేశారు. అతర్వాత మట్టి తరలింపు యధేచ్ఛగా కొనసాగించడంతో పోలీసులకు సమాచారం అందించడంతో రెవెన్యూ, మైనింగ్ శాఖలకు ఫిర్యాదు చేయండి అంటూ.. సమాధానం ఇచ్చారు. దీంతో స్థానికులు కేటిదొడ్డి తహసీల్దార్ కు ఫిర్యాదు చేయగా.. అధికారులు అక్కడికి వెళ్లే లోపే అక్రమార్కులు మట్టి తొవ్వకాలు నిలిపివేశారు. అధికారులు వెళ్లిన వెంటే... తిరిగి తమ దందాను కొనసాగించారు. అక్రమ మట్టి తరలింపును అడ్డుకట్ట వేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయదారిత పరిశ్రమగా తేనెటీగల పెంపకం

## అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య

కొత్తకోట(మోజెర్ల) ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) నైపుణ్యంతో చేపట్టినట్టయితే రైతులు తేనెటీగల పెంపకాన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా విజయవంతం చేయవచ్చని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన కళాశాల వేదికగా జిల్లా స్థాయి తేనెటీగల పెంపకం మీద శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజేంద్రనగర్ లోని కూరగాయల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ... భారతదేశంలో లభించే తేనె అత్యంత శ్రేష్టమైనదని, పోషక విలువలతో పాటు ఔషధ గుణాలు ఉ ండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అన్నారు. తేనెటీగలు పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే రైతులకు అదనపు ఆదాయం కచ్చితంగా లభిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి, పర్యావరణానికి, మానవ సమాజానికి ఎక్కువగా ఉపయోగపడి ఏకైక పరిశ్రమగా తేనెటీగల పెంపకం పేరు పొందిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో సాధించబోయే తీపి విప్లవానికి ప్రధాన భూమిక బి కీపింగ్ అంటే తేనెటీగల పెంపకం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనేక బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు తేనెటీగల పెంపకానికి ఆర్థిక మద్దతు ఇస్తున్నాయని, లోన్లు సైతం ఏర్పాటు చేస్తున్నందు వల్ల రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయం పొందాలని కోరారు. తక్కువ పెట్టుబడి తో సంవత్సరం అంతా ఉపాధి తేనెటీగలు పెంపకం ఉంటుందని తెలిపారు. తేనెకు ఎంతకాలమైన నిలువ ఉండే సామర్థ్యం ఉ ంటుందని అందువల్ల నష్టాలు ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉ ండవని డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరగాయల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వీర సురేష్, విస్తరణ అధికారి పోతరాజు యాదయ్య, అలాగే పెద్దమందడి, కొత్తకోట మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు సుమారు 30 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శిక్షణ దారులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్ మాట్లాడుతూ... ఆరు రోజుల కార్యక్రమం లో తేనెటీగల జాతులు, శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, తేనె పట్టు నిర్వహణ, తేనె తీయుట విధానం, తేనెటీగల పెంపకం ద్వారా లభ్యమయ్యే ఉ త్పత్తులు మార్కెటింగ్ మెలకువల గురించి శిక్షణ ఇస్తామని తెలిపారు.



తేనెటీగల పెంపకం పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు




శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సైదయ్య






# అంగరంగ వైభవంగా శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలోని కోటలో వెలిసిన శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో సోమవారం కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి ఫల పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణ చేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేద పండితుల వేదమంత్రోచారణల మధ్య శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా అనేకమంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. దేవాలయ విచారణ కర్త ప్రభాకర్ రావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల చారి ఆధ్వర్యంలో స్వామివారి సంకీర్తనలు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.

# ఆర్టీసీ బస్సుకు బైక్‌తో ఢీకొని వ్యక్తి మృతి

కొత్తకోట, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) ఆర్టీసీ బస్సుకు బైక్ తో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర మండలం గుడిబండ గ్రామానికి చెందిన విగ్నేశ్వర్ రెడ్డి (50) గత మూడు రోజుల నుండి కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని అంబ భవాని మాత ఉత్సవాల్లో పాల్గొనేందుకు తన మామ ఇంటికి వచ్చాడని సాయంత్రం ఇంటి నుండి బైక్ పై చౌరస్తాకు వెళుతుండగా కొత్తకోట నుండి వనపర్తి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు విగ్నేశ్వర్ రెడ్డి బైక్ తో ఢీ కొనడంతో అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై ఆనంద్ తెలిపారు.



విగ్నేశ్వర్ రెడ్డి

# ప్రజా భద్రతే లక్ష్యంగా పనిచేయాలి

## ఎస్పీ శ్రీనివాసరావు.. ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువ



గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యలపై వచ్చిన ఆరు మంది భాదితుల సమస్యలను., గద్వాల డిఎస్పి మోగిలయ్యా, ఆలంపూర్, గద్వాల , శాంతి నగర్ సర్కిల్ అధికారుల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు. భాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులలో విచారణలో ఏలాంటి జాప్యం జరగకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి -02, కుటుంబ/ఇతర తగాదాలకు సంబందించి -02, ఇతర అంశాలకు సంబంధించి -02 పిర్యాదులు అందాయి.





# స్థానిక సంస్థ ఎన్నికల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం) రాజ్యాంగ బద్ధంగా ఎంపిటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలలో గిరిజనులకు 10% రిజర్వేషన్ కేటాయించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని సేవాలాల్ సేన నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావులకు సేవాలాల్ సేన సంఘం ఆద్వర్యంలో గిరిజనులకు 10% రిజర్వేషన్ కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి సుమారు 80 సంవత్సరాలు అవుతున్నా ప్రత్యేక జిల్లాలు ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా నేటికి గద్వాల జిల్లాలో గిరిజనులకు ఒక్క జడ్పిటీసీ, ఒక్క ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్ కల్పించలేదన్నారు. గద్వాల జిల్లాలో 15 వేలకు పైగా గిరిజనులు ఉన్నారని. జిల్లాలో 13 ఎంపీపీ, 13 జెడ్పీటీసీలు స్థానాల్లో గిరిజనులకు రిజర్వేషన్ లేకపోవడం బాధకరమన్నారు. జనాబా ప్రాతిపదికన గిరిజనులకు 10% రిజర్వేషన్ లో 1 ఎంపీపీ, 1 జడ్పీటీసీ గిరిజనులకు కేటాయించాలని, అదే విధంగా సుమారు 144 ఎంపీటీసీల్లో 10% రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అద్యక్షులు ఎల్.రవినాయక్, ఉపాధ్యక్షుడు ఎన్. రవి నాయక్ , కోశాదికారి సురేష్ నాయక్, సెక్రటరీశంకర్ నాయక్, మాజీ అధ్యక్షుడు రూపుల నాయక్, మాజీ సర్పంచులు తన్యా నాయక్, వీరేష్ నాయక్, విద్యార్థి సంఘం నాయకులు భీమానాయక్, నరసింహ నాయక్ సురేష్ నాయక్, శంకర్ నాయక్ తదితరలు పాల్గొన్నారు.




# రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం) అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, ఒకరి పై కేసు నమోదు చేశారు. ఈ ఘటన గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కళ్యాణ్ రావు తెలిపిన వివరాల ప్రకారం గద్వాలకు చెందిన మారెన్న రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున బులేరో వాహనంలో తరలిస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. సుమారు 13 క్వింటాళ్ల బియ్యంతో పాటు బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# నూతన ప్రేమ్ ఫోటో స్టూడియోను ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శేఖర్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం) జిల్లా కేంద్రంలో సెకండ్ రైల్వే గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రేమ్ ఫోటో స్టూడియో సోమవారం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమాని ప్రేమ్ కుమార్ మరియు రవి కి శుభాకాంక్షలు ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్లు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శేఖర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ వృత్తిలో ఓపికతో పని చేస్తూ ముందుకు నడుచుకోవాలని, బిజినెస్ లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, నరేష్, వెంకటేష్, గౌస్, అంజి, ప్రశాంత్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



# కుంభమేళాలో వెల్లివిరిసిన మతసామరస్యం

శంషాబాద్, ఫిబ్రవరి 10 ( ప్రభాత ఉదయం) కుంభమేళాలో మతసామరస్యానికి ప్రత్యేకగా శంషాబాద్ యువకులు నిలిచారు. శంషాబాద్ మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్ తన మిత్రులతో కలిసి కుంభమేళాలో పవిత్ర స్నానం చేసి వచ్చారు. శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామానికి చెందిన శంషాబాద్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గణేష్ నాయక్. అసమించి రకాల మిత్రుడు సురేష్ గౌడ్. గౌస్ బాషా కలసి కుంభమేళా పవిత్ర స్నానానికి వెళ్లారు. కుల మతాలకు అతీతంగా పవిత్రమైన కుంభమేళాలో స్నానం చేయడంతో పాటు కాశి అయోధ్యలో దర్శనం చేసుకుని తిరిగి వచ్చారు. కుల మతాలకు అతీతంగా తనకు సహకరించి జీవితాన్ని దన్యం చేసుకున్న వారిద్దరికీ గణేష్ నాయక్ ధన్యవాదాలు చెప్పారు. 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే కుంభమేళాలో స్నానం చేసుకునే అవకాశం కల్పించిన గణేష్ నాయక్ కు బొగ్గుల సురేష్ గౌడ్. గౌస్ పాష కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608